క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి అగ్నిమాపక అధికారి కె.ప్రశాంత్‌కుమార్ గుండె పనితీరు, అగ్ని ప్రమాదాలపై శనివారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారించే పద్ధతిని ప్రత్యక్షంగా చేసి చూపించారు. అనంతరం సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఆర్.సూర్యారావు, టి.కామరాజు, కాశీనాథ్, నరేష్, ఈశ్వరరావు, నీలాచలం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వ్యర్థాలను అందించాలి



ఈ–వేస్ట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: ప్రజలు ఎలక్ట్రికల్ వ్యర్థాలను మున్సిపాలిటీకి అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ కోరారు. మున్సిపాలిటీలో పాడైపోయిన ఎల్రక్టానిక్ వ్యర్థాల సేకరణ కోసం ఈ–వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి రోడ్డులో ఉన్న లైబ్రరీ వద్ద ఎల్రక్టానిక్ వ్యర్థాలను సేకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు వ్యర్థాలను ప్రతీ బుధవారం మున్సిపాలిటీకి అందించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దిలీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బొడ్డబడ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని కొళిగాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం కొళిగాం క్లస్టర్ పరిధిలోని బొడ్డబడ గ్రామం నుంచి 21 మంది విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా అరకభద్ర గ్రామం నుంచి 12 మంది, కీర్తిపురం నుంచి 30 మంది, పాయితారి నుంచి 6 మంది విద్యార్థులు తమ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాస్, చంద్రవదన, వాణి, దేవాకి, పద్మావతి, రేణుక, కిరణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పరామర్శ



జెడ్పీటీసీ యశోద కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామంలో జెడ్పీటీసీ తడక యశోద అత్త, సర్పంచ్ తడక జోగారావు తల్లి తడక అన్నపూర్ణమ్మ శుక్రవారం మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పరామర్శించారు. అలాగే ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ పరామర్శించి సంతాపం తెలిపారు. వారితో పాటు పార్టీ నాయకులు శిలగాన భాస్కరరావు, ఇప్పిలి కృష్ణారావు, డొక్కరి బలరాం, రాపంతి చిట్టిబాబు, రాజారెడ్డి, దక్కత నూకయ్య తితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

వజ్రపుకొత్తూరు: మండలంలో పూండి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని పలాస విద్యుత్ శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పూండి, పీఎంపురం, అమలపాడు, కేశరోపేట పాతటెక్కలి, కొత్తపేట, దేవునల్తాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



మంకినమ్మ ఆలయం సమీపంలో రోడ్డుపై మురుగు



పాత జాతీయ రహదారిపై నిలిచిన మురుగునీరు(ఫైల్)

మున్సిపాలిటీ కాదు... మురికిపాలిటీ..!

- అధ్వానంగా పలాస – కాశీబుగ్గ
- వర్షమొస్తే దుర్గంధం
- రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీని కూటమి ప్రభుత్వం మురికిపాలిటీగా మార్చేసింది. చిన్నపాటి వర్షం పడినా చాలు కాలువల్లో మురుగునీరు ప్రవహించక రోడ్డుపైకి వ్యర్థాలు చేరి దుర్గంధంగా మారుతోంది. దీనివలన ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాలిథిన్ వినియోగం విచ్చలవిడిగా పెరగడంతో కాలువల్లో పేరుకుపోయి మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఇరవై ఏళ్ల క్రితం నిర్మించిన మురుగు కాలువలే ఇప్పటికీ వినియోగిస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో గ్రేడ్ – 2 మున్సిపాలిటీగా ఉన్నటువంటి పలాస – కాశీబుగ్గను కేవలం బిల్లులు పెట్టుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

అడుగడుగునా సమస్యలే

- 20వ వార్డు లేబర్ కాలనీలో ఉన్నటువంటి ఒక టిఫిన్ షాపు, పలు ఇళ్లలోకి ప్రతిరోజూ మురుగు నీరు చేరి దుర్వాసన కొడుతోంది. దీంతో టిఫిన్ షాపును మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.
- మంకినమ్మ ఆలయం సమీపంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. నాలుగు రోజులుగా ఆ మురుగు నీటి నుంచే స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు.
- కేటీ రోడ్డు నిర్మాణంలో పలు టెక్నికల్ సమస్యల వలన వర్షపు నీరు ఎక్కడబడితే అక్కడే నిలిచిపోతుంది. దీంతో పాదచారులు, ప్రయాణికులకు సమస్యలు తప్పడం లేదు.
- కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వద్ద ఎగువ నుంచి వచ్చిన నీరు కాలువల్లో ప్రయాణించకుండా రోడ్డుపైకి వస్తుండడంతో వరద కాలువను తలపిస్తోంది.
- కాశీబుగ్గ రైల్వేగేటుకు ముందు పాత జాతీయ రహదారిపై మోకాళ్ల లోతుతో మురుగు నీరు నిలిచిపోతోంది.
- 2వ వార్డు, 19వ వార్డు సూదికొండలో రోడ్డుపై మురుగునీరు, చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో ఐటీఐ కళాశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.
- పలాసలో ఇందిరాచౌక్ నుంచి మొగిలిపాడు వరకు ఇరుకైన రోడ్డు కావడంతో వరదనీరు రోడ్డుపైన ప్రయాణిస్తుంది.



ఉదయపురంలో కాలువ సరిచేసుకుంటున్న స్థానికులు (ఫైల్)

- 26, 24, 31, 27 వార్డుల పరిధిలో ఇళ్ల ముందు వరదనీరు, చెత్త నిలిచిపోయి స్థానికులు ఎప్పటికప్పుడు తొలగించుకునే చర్యలు చేపడుతున్నారు.
- 10, 11, 14 వార్డుల్లో కల్వర్టుల కింద ప్లాస్టిక్ నిల్వలు ఉండిపోవడంతో వారంతా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ జేసీబీ తీసుకొచ్చినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విడిచిపెట్టేశారు.



ఐటీఐ కళాశాల రోడ్డులో పరిస్థితి

ప్రశ్నించేవారు కరువయ్యారు



మున్సిపాలిటీ పరిధిలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా, ఎటువంటి కార్యకలాపాలు చేపట్టినా మున్సిపల్ కమిషనర్ బిల్లులు పెట్టుకుంటున్నారు తప్ప, ప్రజల సమస్యలు పరిష్కరించడం లేదు. మా లేబరు కాలనీలో నిత్యం పారిశుద్ధ్యం లోపంతో పాటు ఇళ్లల్లోకి మురుగు చేరినా పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య లోపాన్ని ఎత్తిచూపించేవారు కరువయ్యారు. కూటమి వచ్చిన పది నెలల్లో మున్సిపాలిటీలో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

– అంబటి ఆనందరావు, లేబరుకాలనీ, పలాస

దుర్గంధంగా మారింది



ఇటీవల రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగు నీరు, చెత్తా చెదారం రోడ్డుపైకి వచ్చి చేరుతున్నాయి. ఎక్కడికక్కడ సమస్యలు తెలెత్తిన విషయం వాస్తవమే. ఆయా ప్రాంతాల్లో చర్యలు చేపడతాము. ప్లాస్టిక్ అమ్మకాలను నియంత్రించే ప్రయత్నం చేసినా ఎవ్వరూ సహకరించడం లేదు. ఇకపై ప్లాస్టిక్ కవర్లు అమ్మినట్టు కనిపిస్తే తక్షణమే కేసులు నమోదు చేస్తాం. తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపడతాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

అధికారులు గైర్హాజరైతే ఎలా..?

- మండిపడిన ఎంపీపీ నీలవేణి
- సర్వసభ్య సమావేశం నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యుల వాకౌట్



సభ నుంచి వాకౌట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సభ్యులు

వజ్రపుకొత్తూరు: సర్వసభ్య సమావేశాలకు అధికారులు హాజరవ్వకపోతే, సభ్యుల ప్రశ్నలకు ఎవరు సమాధానం చెబుతారని ఎంపీపీ నీలవేణి అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నడిమింటి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల అధికారాలను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. మండల పరిషత్ తీర్మానాలను బుట్టదాఖలు చేస్తున్నారని, ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ సభ్యులతో కలిసి సభ నుంచి వాకౌట్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

అంతకుముందు సభ దృష్టికి పలు సమస్యలను సభ్యులు తీసుకొచ్చారు. బెండిగేటు ఎస్సీ కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, రైల్వే ఫ్లై ఓవర్ వంతెనపై విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, చీపురుపల్లి – నువ్వలరేవు రహదారి పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని కో–ఆప్షన్ సభ్యుడు మరడ భాస్కరరావు కోరారు. మండల కేంద్రంలో తాము నిధులు వెచ్చించి నిర్మించిన భవన ప్రారంభోత్సవానికి ఎంపీపీకి సమాచారం ఇవ్వకపోవడం దారుణమని ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కార్పొరేషన్ రుణాలు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చారని, నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వంక రాజు, విప్ తిత్రగుణ తదితరులు పాల్గొన్నారు.

ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు

కంచిలి:

స్థానిక సోంపేట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ట్రైన్, కోచ్ ఇండికేషన్ బోర్డుల ఏర్పాటు ప్రక్రియ కొన్ని రోజులుగా ముమ్మరంగా జరుగుతోంది. ఇప్పటికే మూడు ప్లాట్ ఫారంలలో 2 ట్రైన్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేయగా , మరో రెండు బోర్డులు కూడా ఏర్పాటు చేయనున్నారు. ట్రైన్ ఇండికేషన్ బోర్డుల ద్వారా ఇక్కడ హాల్టు కల్పిస్తున్న ట్రైన్ టైమింగ్స్, మిగతా సమాచారం డిస్‌ప్లే చేస్తారు. అలాగే ఒక్కో ప్లాట్‌ఫాంలో 25 చొప్పున కోచ్ ఇండికేషన్ బోర్డుల ఏర్పాటు పనులు చేపడుతున్నారు. దీనివలన ప్రయాణికులకు మేలు జరుగుతుందని ఖుర్దా సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎస్.అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పనులన్నీ ఖుర్దా రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు తెలిపారు.



రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రైన్ ఇండికేషన్ బోర్డు

బాధ్యతల స్వీకరణ

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు డిప్యూటేషన్ ప్రాతిపదికన శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా హరిపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వెంకట్రావుకు టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యింది. దీంతో అక్కడ నుంచి డిప్యూటేషన్ ప్రాతిపదికన టెక్కలి పంచాయతీ కార్యదర్శిగా అదనపు విధులు అప్పగించారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

కవిటి: మండలంలోని రాజపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

పాఠశాలకు వితరణ



మెక్‌సెట్, టెంట్లు అందజేస్తున్న దాతలు

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పలు వస్తువులను వితరణగా దాతలు శనివారం అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గన్నవరపు గోవిందరావు తన తల్లిదండ్రులైన మల్లేషు, తవిటమ్మల జ్ఞాపకార్థం ఖరీదైన రెండు టెంట్లు, పాఠశాల పూర్వ విద్యార్థి శ్రీకృష్ణాపురం గ్రామానికి చెందిన బాడాన శ్రీనివాసరావు, ఉదయ్‌కుమార్‌లు సౌండ్ సిస్టమ్‌ను వితరణగా అందించారు. దాతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం, అప్పిని వెంకటేష్, ముద్దపు రమణమూర్తి, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రన్ ఫర్ జీసస్



ఇచ్ఛాపురం: రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవులు

ఇచ్ఛాపురం: గుడ్ ఫ్రైడే అనంతరం క్రీస్తు పునరుద్ధానం పురస్కరించుకొని ఇచ్ఛాపురం నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో రన్ ఫర్ జీసస్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా శ్రీసురంగి రాజా క్రీడా మైదానం వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్, నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు ఎలియా, పాస్టర్లు జాన్సన్, సుందర్‌రాజు, ఎం.పాల్, షాలేమ్, బిమ్మోబెహర, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి క్రైస్తవ సంఘం పెద్దలు పి.విజయ్‌కుమార్, ఎంవీఎస్ మూర్తి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో నియోజకవర్గ క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండపం నిర్మాణానికి భూమిపూజ

కంచిలి: మండలంలోని కొల్లూరు పంచాయతీ పరిధి సిర్తలి గ్రామ శ్మశానవాటికలో ప్రజల సౌకర్యార్థం మండపం నిర్మాణానికి సర్పంచ్ పైల రేఖాలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి చేతులమీదుగా శనివారం భూమిపూజ చేశారు. 14వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులు రూ.4 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టనున్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నేతలు లడ్డుకేశవపాత్రో, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, పైల మోహన్‌రెడ్డి, కాయ నూకయ్య, పైల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

నేడు చలో సూదికొండ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి సూదికొండలో అక్రమంగా కంకరను తరలిస్తున్నారని, ఆ ప్రాంతంలో నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి ఆరోపించారు. కేంద్రీయ విద్యాలయం పేరుతో భూసేకరణలో నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని, పెద్దల భూములను విడిచిపెట్టి పేదల భూములను తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన కూటమి ప్రభుత్వం, అధికారులను నిలదీసేందుకు అన్ని పార్టీల నాయకులతో కలిసి చలో సూదికొండ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



సూదికొండలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు

వజ్రపుకొత్తూరు: సూదికొండలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ గ్రావెల్ తవ్వకాలు, పేదల ఇళ్లు కూల్చివేతలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు చేపట్టనున్న చలో సూదికొండకు వైఎస్సార్‌సీపీ నాయకులు తరలి రావాలని ఆ పార్టీ నాయకుడు పుక్కళ్ల గురయ్యానాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

తాగునీరు అందించండి

టెక్కలి: తమ గ్రామానికి తాగునీరు అందజేయాలని టెక్కలి మండలంలోని తెలినీలాపురం పంచాయతీ వేములవాడ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి రషీద్ అహ్మద్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. గతంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా తమ గ్రామానికి పైపులైన్ల ద్వారా తాగునీరు అందజేసేవారని, ఇప్పుడు విశ్వనాథపురం గ్రామం మధ్యలో పైపులైన్లను అనధికారకంగా వినియోగించడంతో తమ గ్రామానికి తాగునీరు రావడం లేదని వాపోయారు. ప్రస్తుతం వేసవి కావడంతో మంచినీటి కోసం అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి నీరు సరఫరా చేయాలని విన్నవించారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

టెక్కలి రూరల్: ప్రజలు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కోటబొమ్మాళి అగ్నిమాపక అధికారి పీఆర్ రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలి

సోంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచడానికి కృషి చేయాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి తవిటినాయుడు సూచించారు. కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. వేసవి తరగతులు నిర్వహించడానికి గల కారణాలు విద్యార్థులకు వివరించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ ఎస్.మోహనరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి

మందస: ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారి కె.అనిత సూచించారు. శనివారం మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారి ఎం.సంపత్‌రావును అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి ఉన్న రికార్డులను పరిశీలించారు. అన్నివేళల ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పీహెచ్‌సీలో ఓపీలు, ప్రసవాలు పెరిగేవిధంగా చూడాలన్నారు.

విద్యార్థులకు అభినందనలు

కంచిలి/కాశీబుగ్గ: ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కంచిలి మండలంలోని బూరగాం గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న విద్యార్థిని సింహాద్రి హాసిని, అలాగే జిల్లాస్థాయిలో తృతీయ స్థానం సాధించిన రెంటికోటలో 8వ తరగతి చదువుతున్న రాజాన స్నేహను కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ మేరకు శనివారం బారువ బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అలల హోరు.. కేరింతల జోరు

- ఉత్సాహంగా బారువ బీచ్ ఫెస్టివల్



బారువ తీరంలో ఏర్పాటు చేసిన ఆలివ్ రిడ్లే తాబేలు సైకత శిల్పం



తీరానికి చేరుకున్న పర్యాటకులు



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్

బారువ తీరం జనసంద్రమైంది. మొదటిసారి ఈ ప్రాంతంలో శనివారం నిర్వహించిన బీచ్ ఫెస్టివల్‌కు పర్యాటకులు పోటెత్తారు. దీనిలో భాగంగా చేపట్టిన బీచ్ వాలీబాల్ పోటీలు, పడవ పోటీలు ఆకట్టుకున్నాయి. ఆలివ్ రిడ్లే తాబేళ్ల జీవిత చరిత్ర చక్రం ప్రదర్శన చూపరులను కట్టిపడేసింది. అలాగే సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఆదివారం కూడా ఫెస్టివల్ కొనసాగనుంది.

– సోంపేట